


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం,8 మే 2025

8 పేజీలు


## రాజమహేంద్రవరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుదాం

: కలెక్టర్ పి.ప్రశాంతి
- నగరాన్ని టూరిజం హబ్‌గా మార్చడమే లక్ష్యం
: కమిషనర్ కేతన్ గార్గ్
- రానున్న రోజుల్లో రూ.220 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- రాజమహేంద్రవరం చరిత్రలో రిఫర్ ఫ్రంట్ అభివృద్ధి ఓ మైలురాయి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** పుష్కరపనుల్లోభాగంగా రాజమహేంద్రవరం నగరాన్ని అత్యంత సుందరమైన నగరంగా తీర్చిదిద్దనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.రూ.8కోట్ల నిధులతో రివర్ ఫ్రంట్ అప్పర్ ప్రామినేడ్ అభివృద్ధి పనులకు గోదావరి గట్టున ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహంవద్ద బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర కమిషర్ కేతన్ గర్గ్,రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోమువీర్రాజు,రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి,మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.అనంతరంగ్యాలరీలో నమూనా ఫోటోలను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ..గోదావరి నదీ తీరంలో ఉన్న రాజమహేంద్రవరంనగరాన్ని ఆహ్లాదకరంగా మార్చేందుకు పక్కాప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు.ప్రస్తుతనగర జనాభా 5లక్షలు కాగా..పుష్కర సమయంలో రోజూ 10లక్షలమంది ఈ ప్రాంతానికి వస్తారనే అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు.గత పుష్కరాల సమయంలో కేవలంపుష్కరఘాట్లనుమాత్రమేఅభివృద్ధి చేసుకున్నామని.. కానీ ఈ పుష్కరాలు పూర్తి భిన్నంగా ఉండబోతున్నాయన్నారు. వచ్చే భక్తులకు పూర్తిస్థాయి సౌకర్యాల కల్పించడంతో పాటు నగర సౌందర్యాన్ని కూడా చూపబోతున్నట్లు కలెక్టర్ చెప్పారు. రాజమహేంద్రవరం అభివృద్ధిపై అధికార యంత్రాంగంతో పాటు ఇటు ప్రజాప్రతినిధులు కూడా నిత్యం దృష్టి సారిస్తున్నారని.. కనుక 2027 పుష్కరాల నాటికి నగరం మరింత అందంగా,ప్రజలకుసౌకర్యవంతంగా మారుతుంద నడంలో ఎటువంటి సందేహం లేదన్నారు.అలాగే అఖండ గోదావరి ప్రాజెక్టు కింద కేంద్ర పర్యాటక శాఖద్వారా రూ.100కోట్ల నిధులు మంజూరు అయినట్లు కలెక్టర్ తెలిపారు.ఈనిధులలో రూ.97 కోట్లు ఒక్క రాజమండ్రినగరానికే కేటాయించగా..పనులు త్వరలోనే ప్రారంభమవుతా యని వెల్లడించారు. అలాగే రానున్న 6నెలల కాలంలో నగరంలో 22 పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.ఓవైపు అభివృద్ధిపనులు శరవేగంగా జరుగు తున్న ప్పటికీ.. వాటిని పరిరక్షించవలసిన బాధ్యత నగర పౌరులదేనని కలెక్టర్ అన్నారు. రోడ్లు, పార్కులు నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంలో పౌరుల బాధ్యత కీలకమన్నారు.ప్రజలు తమసహాయ సహకారాలుఅందిస్తే 2027 పుష్కరాల నాటికి రాజమహేంద్ర వరాన్ని ఇండోర్ నగరానికి మించి సుందర నగరంగాతీర్చిదిద్దుతామని స్పష్టంచేశారు.ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ..ఈ ప్రాంతాన్ని అన్ని

- తరువాయి 2లో..



## రూ. 2.72 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు భూమి పూజ..



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో:** గోశాలలో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ, ఎమ్.ఎల్.సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) మరియు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్&వైస్ చైర్మన్, కౌడా,కుమారిభావన ఐఏఎస్ వారిచే భూమి పూజ నిర్వ హించడం జరిగింది.ఈసందర్భంగా స్థానిక శాసనసభ్యులు మాట్లాడుతూ'గోసేవే దైవసేవ',అంటే గోవులను రక్షించడం, సేవ చేయడం మనసంస్కృతిలో ఎంతో ముఖ్యమైన అంశం అని ఈదిశగా మనంరూ.2.72కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ఆనందదాయకం అని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ రానున్న రెండు నెలలలో

- తరువాయి 2లో..

## పిఠాపురంలో దారుణం..









- ఐదు నెలల పసికందును బావిలో పడవేసి చంపిన వైనం
- ఇంటిముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయతో క్షుద్ర పూజల ఆనవాళ్లు
- రంగంలోకి దిగిన క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్
- దర్యాప్తు చేపట్టిన పిఠాపురం పోలీసులు

**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** పిఠాపురం పట్టణం స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో బుధవారం అమానుష ఘటన చోటుచేసుకుంది. అభం శుభం తెలియని ఐదు నెలల వయసున్న చిన్నారిని బావిలో పడవేసిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంటి ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయతో క్షుద్ర పూజలు చేసినఆనవాళ్లుఉండడంతో... క్షుద్ర పూజలు చేశారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతు న్నాయి. పట్టణంలోని స్థానిక జగ్గయ్య చెరువు ప్రాంతంలో నివాసముంటున్న పి.దుర్గారావు అన్నవరంల కుమార్తె శైలజ రెండు సంవత్సరాల క్రితం నరసింగపురం గ్రామానికి చెందిన పి.సతీష్‌లు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఐదు నెలల క్రితం శైలజ పండంటి ఆడబిడ్డకుజన్మనిచ్చింది.ఇటువంటి దారుణ సంఘటన చోటు చేసుకోవడంతో పాపతల్లిశైలజ గుండెలవిసేలా రోదిస్తున్నారు.

- తరువాయి 2లో..

## 'అల్లూరి' జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్!

- కీలక మావోయిస్టు నేతలు ఇరువురు హతం
- పోలీసులకు రెండు ఎకె 47లు లభ్యం






**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని వై.రామవరం అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్ పోలీసులకు, మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో ఇరువురు మావోయిస్టు అగ్రనేతలు మృతి చెందినట్టు సమాచారం అందింది. బుధవారం మధ్యాహ్నం ఎన్‌కౌంటర్ సంఘటన వై.రామవరం మండలం యార్లగడ్డ పంచాయితీ పరిధిలోని శేషసాయి సమీప అటవీప్రాంతంలో గ్రేహౌండ్స్ పోలీసులు మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు జరుపుతుండగా నక్సల్స్‌తో ఎదురు కాల్పులు సంఘటన జరిగింది. ఈ విషయాన్ని రంపచోడవరం డిఎస్పీ జి.సాయిప్రశాంత్ ధ్రువీకరించారు. శేషసాయి ఎన్‌కౌంటర్‌లో ఇరువురు మావోయిస్టు అగ్రనేతలు మృతి చెందినట్టు పోలీసులుగుర్తించారు.మృతి చెందినవారిలో మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ జగన్ ఉన్నట్టు సమాచారం. జగన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 26 లక్షల రూపాయలు రివార్డు ప్రకటించడం జరిగింది. అలాగే ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీకి చెందిన డీసీఎం రమేష్ ఉన్నట్టు పోలీసువర్గాలు పేర్కొన్నాయి. కాగాఅనితఅనే మహిళా మావోయిస్టు సహామరి కొంతమంది మావోయిస్టులు కాల్పులు ఘటన తర్వాత

- తరువాయి 2లో..

# రాజమహేంద్రవరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుదాం

మొదటిపేజి తరువాయి

విధాలా అభివృద్ధి పరచడానికి పుష్కరాలేవి ఓ మంచి వేదిక అని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు సమీకరించి.. కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అడుగులు వేద్దామన్నారు. గతంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ ట్యాంక్ బండ్పై అనేక మంది ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఆ విగ్రహాలను నేడు ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో రోజూ తిలకిస్తున్నారని చెప్పారు. అదేవిధంగా గోదావరిబండ్పై ఉన్న విగ్రహాలను కనెక్టింగ్ బ్రిడ్జి ద్వారా పరిరక్షిస్తూ..ఈప్రాంతాన్ని సుందరప్రాంతంగా తీర్చిదిద్దుతుండటం సంతోషదాయకమన్నారు.రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్గా మార్చడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గడిచిన 10 నెలల కాలంలో నగరంలో రూ.220 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. వీటిలో రూ. 128 కోట్లు పుష్కర పనులు కాగా పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. 2025 ఏడాదిలోనే రూ. 29 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. రూ. 8 కోట్ల నిధులతో చేపట్టిన రిఫర్ ఫ్రంట్ డెవలప్మెంట్ పనులు కూడా రానున్న 6 నెలల కాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటితో పాటు చిట్ట చివరి కాలనీ వరకు విద్యుత్ వెలుగులు ప్రసరించేలా రూ. కోటి నిధులతో స్ట్రీట్ లైట్లను అన్ని ప్రాంతాలలో అమరుస్తున్నట్లు తెలిపారు. అలాగే పార్కులు, రోడ్డు విస్తరణ పనులు, జంక్షన్ ల అభివృద్ధి పనులు వివిధ దశలలో ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. తొలిదశలో 3 జంక్షన్ లలో పనులు జరుగుతుండగా.. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో అన్ని జంక్షన్లను అభివృద్ధిపరుస్తామన్నారు. 2027 పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగరంలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నట్లు వివరించారు. మరోవైపు ట్యాక్స్ కలెక్షన్ లో రాజమండ్రి నగరం ఏపీలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని.. కనుక ప్రజల సహాయ సహకా రాలతోనే ఇంతటి అభివృద్ధి సాధ్యపడిందని కేతన్ గర్గ్ తెలియజేశారు. సభాధ్యక్షులు స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ..లి కల్చ రర్ క్యాపిటల్గా ఉన్న రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధి అనేది నగర ప్రజల 15 ఏళ్ల కల అని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పురంధేశ్వరి గారితో కలసి ఈ ప్రాంతంలో పర్యటించిన సమయంలో రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్గా తీర్చిదిద్దుతామని ప్రజలకు హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఆ హామీని నెరవేర్చుకుంటూ నేడు రూ. 8 కోట్ల రిఫర్ ఫ్రంట్ అప్పర్ ప్రామినేడ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అలాగే రూ. 14 కోట్ల నిధులతో లోయర్ ప్రామినేడ్ పనులను కూడా త్వరలోనే ప్రారంభించు కుంటామని చెప్పారు. ప్రస్తుతం పీవీ నరసింహరావు పార్కు, గౌతమీ నందనం పార్కులలో సుమారు 13 ప్రముఖుల విగ్రహాలు ఉన్నాయని.. వాటికి మరింత శోభ తీసుకువచ్చేలా పనులు చేపడతామన్నారు. అలాగే ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా ఈ ప్రాంతాన్ని స్పోర్ట్స్ హబ్గా మార్చేందుకు కూడా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. అభివృద్ధి అనేది ఎప్పుడు ఒక ప్రాంతానికి పరిమితం కాకూడదని.. వికేంద్రీకరణ జరగాలని ఎమ్మెల్యే అన్నారు. గతంలో చిన్నపాటి వర్షానికి కూడా వీరభద్ర నగర్ సహా పలు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యేవని.. కానీ ఈ ప్రభుత్వంలో చేపట్టిన కల్వర్టు పనులతో ఎక్కడా నీరు నిలిచే పరస్థితి లేదన్నారు. అలాగే నగరంలో నేటి నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులను తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవల సిందిగా సూచించారు. వీరి త్రయంలో 2027 పుష్కరాలు అద్భుతంగా జరుగుతాయనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. గోదావరి నదీ తీరంలో కూర్చొని స్వచ్ఛమైన గాలిని పీల్చాలనేది నగర ప్రజల కోరిక అని.. దానిని సాకారం చేస్తున్న జిల్లా కలెక్టర్, నగర కమిషనర్కు ప్రజ ల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఓవైపు గోదావరి నది., మరోవైపు కొండప్రాంతాలు, కోనసీమ అందాలు ఈ ప్రాంత టూరిజంకు ఎంతో దోహదపడే అంశాలన్నారు. కనుక రాజమహేంద్రవరం అభివృద్ధిలో ప్రజలందరూ కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ప్రజా ప్రతినిధులు చల్లా శంకర్ రావు, గన్ని కృష్ణ, అధికారులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

# ‘అల్లూరి’ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్!

మొదటిపేజి తరువాయి

సమీప అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు సమాచారం అందింది. పూర్తి సమాచారం కోసం పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

**ఉలిక్కిపడ్డ మన్యం :** దాదాపు దశాబ్ద కాలం తర్వాత మావోయిస్టుల ఉనికి మన్య ప్రాంతంలో కనిపించడంతో ఏజెన్సీ ప్రజలు ఉలిక్కిపడ్డారు. నక్సల్స్ కార్యకలాపాలు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో చాలా కాలంగా లేకపోవడంతో ఇటీవల కాలంలో ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదు. అయితే సరిహద్దు ప్రాంతాల్లోని చత్తీస్ ఘడ్ ఒడిస్సా రాష్ట్రాల్లో మావోయిస్టు కార్యకలాపాలు విస్తృతంగా జరగడం భారీ ఎన్‌కౌంటర్‌లు, హింసాత్మక ఘటనలు జరగడంతో మావోయిస్టులు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతాలను షెల్టర్‌జోన్‌గా వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సరిహద్దు రాష్ట్రాల పోలీసులు కేంద్ర బలగాలు సహాయంతో మావోయిస్టుల కోసం కుంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. కాగా మావోయిస్టు అగ్రనేతలు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు సమాచారం ఉన్న కేంద్ర పోలీసు బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రేహౌండ్ బలగాలు వై.రామవరం అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులకు మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో ఇరువురు మావోయిస్టు అగ్రనేతలు మృతిచెందగా కొంతమంది సమీప అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ దాడిలో పోలీసులకు రెండు ఏకే 47 తుపాకులతోపాటు విప్లవ సాహిత్యం, ఇతర సామాగ్రి లభ్యమైనట్లు తెలిపారు. సంఘటనా స్థలం మారుమూల అటవీ ప్రాంతం కావడంతో పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని డిఎస్పీ జి.సాయి ప్రశాంత్ తెలిపారు.

# అప్రమత్తంగా వ్యవహరించాలి



– మాక్ డ్రిల్ కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించిన కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం, మేజర్ న్యూస్ :** భారత్ – పాకిస్తాన్ మధ్య నడుస్తున్న ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో పొంచియున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాలోని చమురు సహజ వాయువుల నిక్షేపాలు వెలికి తీస్తున్న బేస్ కాంప్లెక్సు చమురు గ్యాస్ నిల్వలు, గ్యాస్ పైప్ లైన్లు భద్రతకై, పరిసర గ్రామాల ప్రజల భాగస్వామ్యంతో రక్షణపరంగా మాక్ డ్రిల్ నిర్వహించి అప్రమత్తంగా వ్యవహరించాలని చమురు సంస్థల ప్రతినిధులను, భద్రతాపరమైన అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. ఈ సందర్భంగా చమురు సంస్థల ప్రతినిధులు తమ తమ బేస్ కాంప్లెక్స్ లు గ్యాస్ పైప్ లైన్ల వద్ద మాక్ డ్రిల్ సివిల్ మెరైన్ పోలీసులు విపత్తు నిర్వహణ బలగాలు సమీ ప గ్రామాల ప్రజలతో నిర్వహించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్న చర్యలను సమీక్షించగా కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ తాటిపాక, ఓడల రేవు, బోడసకుర్రు ఎస్.యానం తదితర బేస్ కాంప్లెక్స్‌లలో సైబర్ సెక్యూరిటీ, ఐడి కార్డులు సీసీ కెమెరాలు నిఘాలో రాకపోకలు నిర్వహించడం జరుగుతుందని బేస్ కాంప్లెక్స్ ప్రాంతాలలో నో డ్రోన్ ఫ్లయింగ్ జోన్ల నిషేధిత ప్రాంతాలుగా ఆంక్షలు విధించడం జరిగిందన్నారు ప్రతి కదలికను తెలుసుకునే విధంగా ఆన్లైన్ నెట్వర్క్‌ని కూడా అమర్చడం జరిగిందన్నారు. అదేవిధంగా కార్యకలాపాలకు సంబంధించి నియంత్రణ చర్యలు సమర్థవంతంగా చేపడుతున్నట్లు వెల్లడిం చారు పైపులైన్లు స్థితిగతులపై తనిఖీ టీములు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పజలకు అవగాహన కల్పించడం, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలను అప్రమత్తం చేయాలని, చమురు సహజ వాయువుల కార్యకలాపాలు, నిర్వహిస్తున్న బేస్ కాంప్లెక్స్‌ల వద్ద తప్పనిసరిగా ఐదు కిలోమీటర్లు పరిధిలో ప్రజలకు భద్రతా చర్యల పట్ల మాక్ డ్రిల్ క్రమం తప్పకుండా నిర్వహిస్తూ అప్రమత్తంగా చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో అత్యవసర విపత్తుల స్పందన బృందాన్ని జిల్లాకు కేంద్ర బిందువుగా ఏర్పాటు చేసి విపత్తులను తక్షణమే ఎదుర్కొనేలా తీసుకోవాల్సిన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ వారు భద్రతా రక్షణ పరమైన సూచనలను చమురు సహజవాయువుల సంస్థల ప్రతిని ధులు తప్పనిసరిగా ఆచరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ఆర్డీవోలు పి.శ్రీకర్, కే.మా ధవి, డి.అఖిల,ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి మధుసూదన్‌రావు, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ పీ.కే.పీ. ప్రసాద్, చమురు సంస్థల బేస్ కాంప్లెక్స్ ఇంజనీర్లు సెక్యూరిటీ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రూ. 2.72 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు భూమి పూజ..

మొదటిపేజి తరువాయి

గోశాలలో రెండు కొత్త షెడ్‌లు నిర్మాణం ద్వారా గోవులకు వర్షాకాలం, ఎండల కాలంలో రక్షణ కల్పించేలా రూపొందించబడుతున్నట్లు తెలిపారు. గోశాల పరిసరాల్లో సుమారు 300 మీటర్ల రహదారులు నిర్మించబోతున్నట్లు తెలిపారు. ఇది గోవులను తరలించడంలో, ఉద్యోగులు మరియు సందర్శకుల రాకపోకలలో సౌలభ్యం కలిగించడమే కాకుండా, గోశాల స్వచ్ఛత మరియు శుభ్రతకు కూడా తోడ్పడుతుందని, శుభ్రతకు ప్రత్యేక సిబ్బంది ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సదరు నిర్ణయంపై శాసనసభ్యులు, అతిథులు హర్షం వ్యక్తం చేసారు. సుమారు 430 మీటర్ల డ్రెయిన్‌లను నీటి నిల్వలు లేకుండా, వర్షపు నీరు సక్రమంగా బయటకు వెళ్లేలా ఏర్పాటు చేయడం జరుగు తుంది అన్నారు. కుడా చైర్మన్ మాట్లాడుతూ గోసంరక్షణార్థం కౌడా నిధులు కేటాయించి అభివృద్ధి జరగడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ ఎస్ఈ పి.వెంకట్రావు, ఈఈ మత్స్య రాజు, ఇంజనీరింగ్ విభాగపు సిబ్బంది, ఎమ్‌హెచ్ఓ డాక్టర్ పృథ్వీ పాల్గొన్నారు.

# పిఠాపురంలో దారుణం..

మొదటిపేజి తరువాయి

**-అసలు ఏం జరిగింది...?**

అర్ధరాత్రి సుమారు 12:30 సమయంలో... పాపకు పాలిచ్చేందుకు పాప తల్లి శైలజ చూడగా పాప ప్రక్కన లేకపోవడంతో... పెద్దగా కేకలు వేసింది.ఆ కేకలు విన్న పక్క గదిలో ఉన్న శైలజ తమ్ముడు లోవరాజు మరియు ఆమె తండ్రి దుర్గారావు,తల్లి అన్నారంలు ఇల్లంతా వెతికారు. మేడపై నిద్రిస్తున్న శైలజ పెద్దమ్మ గంటా మరిడమ్మ, గంటా రాంబాబులను నిద్రలేపి విషయం చెప్పారు. బంధువులకు ఫోన్ చేసేందుకు ఫోన్ వెతకగా కనిపించకపోవడంతో... వేరొక సెల్ నుంచి శైలజ తల్లి అన్నారం సెల్‌కు ఫోన్ చేశారు. ఆ ఫోన్ ప్రక్కన ఉన్న ఇంటి గోడ అవతల బావి ప్రక్కన రింగ్ అవుతూ కనిపించింది.ఆఫోన్ తీసుకుని తద్వారా బంధువులకు విషయాన్ని తెలియజేశారు. పక్కింటి వారి సహాయంతో..అందరూకలిసి అన్నిచోట్ల వెతికి చివరకు బావిలో పాప పడి ఉండడాన్ని గమనించారు. ఇంటి గుమ్మం మెట్లపై పసుపు, కుంకుమ, నిమ్మకాయ వేసి ఉండడాన్ని చూసారు. పోలీసులకు సమాచారమందించారు.

సమాచారం అందుకున్న పోలీసులు సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో... సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పట్టణ పోలీస్ స్టేషన్కు చెందిన హెూంగార్డు సత్తిబాబు స్వయంగా బావిలోకి దిగి పాప మృతదేహాన్ని బయటకు తీసారు. సుమారు ఒంటి గంటన్నర ప్రాంతంలో పాప మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అన్ని కోణాలలో దర్యాప్తు చేపట్టారు. పలువురు అనుమానితులను ప్రశ్నించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయి. రంగంలోకి దిగిన డాగ్ స్క్వాడ్ పాప అమ్మమ్మ అన్నవరం వద్దకు వెళ్లి నిలిచింది. ఈమెకి చెందిన సెల్ ఫోన్ బావి ప్రక్కన దొరకడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. బావి పక్కన ఆమె సెల్ఫోన్ దొరకడం, డాగ్ స్వాడ్ వెళ్లి ఆమె వద్ద నిలవడంతో ప్రస్తుతానికి పాప అమ్మమ్మ అన్నవరంను అనుమానితురాలిగా పోలీసులు భావిస్తున్నట్టు ప్రాథమికంగా తెలుస్తుంది.

**-క్షుద్ర పూజలు సీన్ క్రియేట్ చేశారా...?**

సంఘటన జరిగిన ఇంటి బయట పసుపు, కుంకుమ, నిమ్మకాయలు వేసి ఉన్నాయి. అసలు నిజంగానే నిద్ర పూజలు జరిగాయా...? నిజంగా జరిగితే ఆ అవసరం ఎవరికి ఉంది అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. లేదా అసలు విషయాన్నీ పక్కదారి పట్టించేందుకు క్షుద్ర పూజలు సీన్ క్రియేట్ చేశారా...? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**-సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ**

సంఘటన స్థలాన్ని ఏఎస్పి మనీష్ దేవరాజ్ పాటిల్ పరిశీలించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్, పిఠాపురం సర్కిల్ ఎస్సైలు వి. మణికుమార్, ఎస్.కె జాన్ భాషా, ఎన్. రామకృష్ణ మరియు ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

**-హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం : సిఐ జి. శ్రీనివాస్**

జరిగిన ఘటనపై హత్య కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ తెలిపారు. ఘటనలో అనుమానితులుగా ఉన్న వారిని విచారిస్తున్నామన్నారు.

# కంచి పీఠ 71వ పీఠాధిపతిగా శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి





**- మురిసిన అన్నవరభక్తులు**

**- కాకినాడ జిల్లాకు దక్కిన అధ్యాత్మిక అదృష్టం**

**- అన్నవర గ్రామమంతా అనందతోరణాలు**

జగద్గురు ఆదిశంకరాచార్యుల 2534 జయంతి సందర్భంగా కంచికామకోటి పీఠాధిపతులు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మహాస్వాములవారు ప్రస్తుత ఉత్తరాధికారిగా సన్యాసదీక్షను అనుగ్రహించి శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతిగా నామకరణ చేసారు. అన్నవరం బ్రాహ్మణ యువకుడు కంచి పీఠాన్ని అధిరోహించడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న పుణ్యం. సత్యదేవుని సేవలో తరించిన గణేష్ శర్మ ఆదిశంకరాచార్యుల వారసునిగా కంచి పీఠాధిపతులుగా శంకరవిజయేంద్ర సరస్వతి మహాస్వాముల ఉత్తరాధికారిగా ఆధ్యాత్మిక లోకానికి భగవంతుడు అందించిన అపూర్వ అద్యాత్మిక సంపదగా భక్తులు భావిస్తున్నారు అనడంలో సందేహం లేదు.

ఆ మహెూన్నత ఘట్టాన్ని తిలకించిన తల్లిదండ్రుల హృదయాలు ఉప్పొంగిపోయాయి. ఆ తల్లిదండ్రులు దుడ్డు శ్రీనివాస సూర్య సుబ్రమణ్య ధన్వంతరి, మంగాదేవి అయితే వారి కుమారుడు దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రమణ్య గణేష్ శర్మ. ఆయన అక్షయ తృతీయ రోజున కాంచీపురపు కంచి కామకోటి 71వ పీఠాధిపతిగా సన్యాస ఆశ్రమాన్ని స్వీకరించారు. అన్నవరం శ్రీ సత్యదేవుని దేవస్థానంలో వ్రత పురోహిత నాయకునిగా నాగాభట్ల కామేశ్వర శర్మ ఉండేవారు. మంగాదేవి తల్లి,స్వయానా నాగాభట్ల కామేశ్వరర శర్మకు తోబుట్టువు. మంగాదేవి తండ్రి కూడా సత్యదేవుని సన్నిధిలో వ్రత పురోహితునిగా పని చేసేవారు. అప్పట్లో పేదరికంలో జన్మించిన దుడ్డు ధన్వంతరి పొరుగూరిలో పౌరోహిత్యం చేస్తూ జీవించేవారు. సన్నిహితుల ద్వారా అతని గుణ గణాలు తెలుసుకున్న నాగాభట్ల కామేశ్వర శర్మ ధన్వంతరికి వ్రత పురోహితునిగా కొలువు ఇప్పించి తన సోదరి కుమార్తె అయిన మంగాదేవిని ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఒక అమ్మాయి,అబ్బాయి జన్మించారు. దుడ్డు ధన్వంతరి, మంగాదేవిల కుమారుడైన గణేష్‌శర్మ 1998లో జన్మించారు. అన్నవరంలోనే 10వ తరగతి వరకూ విద్యనభ్యసించారు. 2009 సంవత్సరంలో ఒక శుభకార్యం నిమిత్తం తల్లిదండ్రులతో పాటు తిరుపతిలో బంధువుల ఇంటికి వెళ్ళారు. ఆ సమయంలోనే నాటి కంచి కామకోటి పీఠాధిపతిని దర్శించుకున్నారు. తేజోమయంగా ప్రకాశిస్తున్న అతని ముఖాన్ని గమనించి, గణేష్ శర్మ ను ఆశీర్వదించి, అతని హస్త రేఖలను పరిశీలించి ఆశ్చర్య చకితులయ్యారు. జగద్గురు ఆదిశంకరాచార్య హస్త రేఖలను పోలి ఉండటం గుర్తించి, వెంటనే గణేష్ శర్మను ద్వారకా తిరుమల దేవస్థానంలో ఋగ్వేద పండితునిగా సేవలు నిర్వహిస్తున్న కర్ణాటకకు చెందిన చందుకుట్ల హెూసమనే రత్నాకర భట్ శర్మ వద్దకు వేద విద్య అభ్యసించమని పంపించారు. కంచి పీఠాధిపతి సూచనలను పాటించి అకుంటిత దీక్షతో 12 సంవత్సరాలపాటు చతుర్వేదాలు సాధన చేసారు. వేద విద్యతో పాటు, ఐతరేయ, బ్రాహ్మణం ఉపనిషత్తులు నేర్చుకున్నారు. మంత్రోచ్చరణలో ప్రావీణ్యం పొందారు. తర్వాత అరసవిల్లి దేవస్థానంలో ఉన్న గురువు రత్నాకర భట్ శర్మ కుమారుడైన శ్రీనివాస శర్మ మార్గ నిర్దేశకత్వంలో వేదగ్రంధాలలో ఉన్నత శిక్షణ పొందారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు శ్రీ వల్లమూడి సత్య వెంకట రమణమూర్తి వద్ద శబ్దమంజరి, ధాతు రూపావళి, సమాస కుసుమావళీ తోపాటు అన్ని సంస్కృత గ్రంధాలు అద్యయనం చేసారు. రామాయణ, మహాభారతాలు, పురాణ, ఇతిహాసాలు అవపోసన పట్టారు. తర్వాత సంస్కృత పండితులు, ప్రముఖ ఋగ్వేద పండితులైన కమ్మపల్లి సతీషా చార్యులు వద్ద సాంప్రదాయ వేద శిక్షణ, అధికారిక విద్య, వేద వివరణ, సంస్కృత వ్యాకరణం తదితర విద్యలు అభ్యసించారు. అనంతరం కొద్ది కాలం పాటు బాసర జ్ఞాన సరస్వతి దేవస్థానం ఆస్థాన వేద పండితునిగా సేవలు నిర్వహించారు. అతి చిన్న వయస్సులోనే, సకల శాస్త్రాలలో ప్రావీణ్యం సంపాదించిన గణేష్ శర్మను కంచి కామకోటి 71వ ఉత్తరాధికారిగా నియమించనున్నట్లు పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ప్రకటించే వరకూ తల్లిదండ్రులకు ఇది ఊహకు కూడా అందని పరిణామం. విజయేంద్ర సరస్వతి స్వామీజీ గణేష్ శర్మ తల్లిదండ్రులను పిలిపించి, ధర్మ పరిరక్షణకై తమ కుమారున్ని కంచి పీఠానికి సమర్పించాల్సిందిగా వారి అనుమతిని కోరారు. వారు సంభ్రమాశ్చార్యాలకు లోనైయ్యారు. ఎంతో మహెూన్నతమైన స్థానం తమ కుమారునికి దక్కుతున్నందుకు ఆనందంతో ఒక్కసారిగా వారి కళ్ళు చెమర్చాయి. వెంటనే తమ సమ్మతిని స్వామీజీకి తెలియజేసారు. 70వ కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి నుంచి పిలుపు రావడంతో గణేష్ శర్మ తల్లిదండ్రులతో కలసి కంచి చేరుకున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో, స్వామీజీ నేతృత్వంలో నాలుగు రోజుల ముందు కామాక్షి దేవి ఆలయం నందు గణపతి, సుబ్రమణ్య హెూమములు, వివిధ ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉపవాస దీక్షలు చేపట్టారు. అక్షయ తృతీయ పర్వదినం నాడు కాంచీపురం కామాక్షి దేవి ఆలయ ప్రాంగణంలో గల పంచగంగ సరస్సు తీరాన తెల్లవారుజామున బ్రాహ్మీముహూర్తములో వివిధ ప్రత్యేక పూజలు నిర్వహించి గురువు విజయేంద్ర సరస్వతీ స్వామీజీ చేతుల మీదుగా సన్యాస దీక్షను స్వీకరించి భవ, బంధాలను విడిచారు. తల్లిదండ్రులు పెట్టిన దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రమణ్య గణేశ శర్మ నామకరణం నుంచి తన గురువు కంచి పీఠాధిపతులు శంకరవిజయేంద్ర సరస్వతి మహాస్వాములు పెట్టిన శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతిగా రూపాంతరం చెందారు. సన్యాస దీక్ష స్వీకరణ అనంతరం కాషాయ వస్త్ర ధారణ, ధండం, కమండలం ధరించారు. గురువు విజయేంద్ర చంద్రశేఖరేంద్ర తలపై సాలిగ్రామం ఉంచి శంఖాభిషేకం నిర్వహించారు. అనంతరం చతుర్వేదాలతో ఉపదేశం గావించారు. 71వ పీఠాధిపతిగా అవతరించిన అనంతరం ఆలయం నందు కామాక్షి అమ్మవారిని, ఆది శంకరాచార్యులను దర్శించి, వేలాది మంది వేద పండితులు వెంట రాగా భారీ ఊరేగింపుగా శంకర మఠానికి చేరుకున్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి



**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని గ్రామాలలో మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకు న్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆత్రేయపురం అల్లూరి సీతారామరాజు సెంటర్లో ఉన్న సీతారామరాజు విగ్రహానికి సీతారామరాజు సేవాసమితి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని, మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి అని, రెండేళ్లపాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకులేకుండా చేసిన సీతారామరాజు తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కార్డులతోపాటు 6 సేవలు ప్రారంభం

**- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్మోహన్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో నూతన రైస్ కార్డుల నమోదుతోపాటు రైస్ కార్డులకు సంబంధించి మరో 6 సేవలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా బుధవారం నుండి ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నూతన రైస్ కార్డుల కోసం ఇప్పటి వరకూ అందిన ధరఖాస్తులను, కొత్తగా పెట్టుకునే ధరఖాస్తులను సచివాలయాలలో ఏపి సేవా ప్లాట్‌ఫారమ్ ద్వారా నమోదు చేసేందుకు మండల, సచివాలయ సిబ్బందిని సంసిద్ధం చేసామని ఆయన తెలిపారు. అలాగే నూతన రైస్ కార్డుల నమోదుతో బాటు రైస్ కార్డుల విభజన, రైస్ కార్డులలో సభ్యులను చేర్చడం, సభ్యుల తొలగింపు, రైస్ కార్డు సరండర్ చేయడం, కార్డులో చిరునామా మార్పు, తప్పుగా నమోదైన రైస్ కార్డు ఆధార్ సీడింగ్ సవరణ సేవల కొరకు కూడా ప్రజలు సచివాలయాలను సంప్రతించవచ్చునని తెలియజేసారు. రైస్ కార్డులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఈ సేవలను జిల్లాలో అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమ ప్రకటనలో కోరారు.

## 18న ఉచిత సామూహిక ఉపనయనాలు - పసుమర్తి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18న ఉచితంగా సామూహిక ఉపనయనాలను నిర్వహిస్తున్నట్లు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులుపసుమర్తి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఇంద్రపాలెంలో నున్న గోశాలలో నిర్వహించడానికి ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న బ్రాహ్మణ కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఉపనయనము చేసుకునేవారివివరాలు ముందుగా తెలియపరచవల సిందిగా కుటుంబ సభ్యులను ఆయన కోరారు. ఉపనయనం చేసుకునే వటువు మన సాంప్రదాయ ప్రకారం పంచ శిఖలు పెట్టుకోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. తర్వాత నుండి ప్రతిరోజు సంధ్యావందనం నిర్వహించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసిందిగా ఆయన కోరారు. హిందూ సాంప్రదాయ పరిరక్షణలో భాగంగా ఇటువంటి హైందవ ధార్మిక కార్యక్రమాలను మిత్రులు మరియు ధార్మికవేత్తల సహకారంతో నిర్వహిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇతర వివరాలకోసం 90592 30598 లో సంప్రదించాల్సిందిగా కోరారు. మీ ప్రాంతంలో ఉన్న బ్రాహ్మణ కుటుంబాలకు ఈ విషయాన్ని తెలియపరచాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## వెంకన్న నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి నిత్య అన్నదాన పథకానికి బుధవారం కట్టుంగ గ్రామానికి చెందిన ఆత్మాల వెంకట, శశి కుమారి వీర రాఘవరావు కుటుంబ సభ్యులు రూ. 1,11,111లు అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు స్వామివారి చిత్రపటం అందించారు.

# జిల్లాలో సముద్రపు నాచు సాగు పైలట్ ప్రాజెక్టుకు రంగం సిద్ధం

**- జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అనువైన ప్రాంతాల పరిశీలన..**
**- సముద్రపు నాచు సాగులో నిపుణులు, శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటనలు..**
**- రెండు రోజులపాటు జిల్లా అంతా పర్యటించి కలెక్టర్కు నివేదిక సమర్పించనున్న నిపుణుల బృందం .**
**- సముద్ర తీరప్రాంత ప్రజలకు స్థిరమైన ఆదాయం కల్పించే దిశగా చర్యలు.**



**అమలాపురం,మేజర్న్యూస్ :** తీర ప్రాంత రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, పర్యావరణ అనుకూలమైన ఉపాధి అవకాశాలను కల్పించేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సముద్రపు నాచు సాగును (సి వీడ్ ఫామింగ్) పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ మేరకు నిపుణులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ప్రాజెక్టును అమలు చేయడానికి ముందడుగులు వేస్తున్నారు. సముద్రపు నాచు సాగు పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించి బుధవారం అమలాపురం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్అధ్యక్షతన తమిళనాడు మండపంలోని సీఎస్ఐఆర్, సిఎస్ఎంసిఆర్ఐలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న సముద్రపు నాచు జాతులలో అనుభవమున్న డాక్టర్ సతీష్, జిల్లా మత్స్యశాఖ, అటవీ శాఖ అధికారులు,రెవెన్యూఇతర నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..సముద్రపునాచు పెంపకం తో రైతులకు సమాచాలకు పర్యావరణానికి ప్రయోజనం చేకూరుతుందని ఆ దిశగా జిల్లాలో సముద్రపు నాచు పెంపకానికి శ్రీకారం చుడుతూ సముద్ర తీరం వెంబడి అనువైన ప్రాంతాలను ఎంపిక చేయడానికి అధ్యయన పర్యటనలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ పైలట్ ప్రాజెక్టులో భాగంగా సముద్రపు నాచు సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించడం ముఖ్యమైన అంశమన్నారు. సముద్రపు జలాలలో సంబంధిత సాగును చేపట్టాలా లేదా తీర ప్రాంతాలలో కృత్రిమంగా ఉప్పునీటి చెరువులను ఏర్పాటు చేసి సాగు చేసే అంశంపై నిపుణుల క్షేత్రస్థాయిలో పర్యటించి అనువైన ప్రదేశాలను గుర్తిస్తారని కలెక్టర్ తెలిపారు.సమావేశం అనంతరం కాట్రేనికోన మండలంలోని కొత్తపాలెం,పల్లం,నీళ్లరేవు,చిరయానం,గచ్చ కాయలపొర, ఉప్పలగుప్తం మండలంలోని ఎన్.కొత్తపల్లి, ఎస్.యానం, వాసాలతిప్ప, మామిడికుదురు మండలంలోని గోగన్నమఠం కరవాక, గొల్లపాలెం, తూర్పుపాలెం, సఖినేటిపల్లి మండలంలోని చింతల మోరి, కేశవదాసు పాలెం అంతర్వేది, గొంది ఎన్.రామేశ్వరం, కొమరగిరిపట్నం, ఓడరేవు, రెబ్బనపల్లి తదితర గ్రామాలలో సముద్రపు నాచు సాగుకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు డాక్టర్ సతీష్ నేతృత్వంలోని నిపుణులు, సంబంధిత శాఖల అధికారులు మే 7నుంచి 8 వరకు స్థల పరిశీలన చేపట్టడానికి బయలుదేరారు. మే8గురువారంరోజున క్షేత్రస్థాయి పర్యటన పూర్తి చేసుకొని జిల్లా కలెక్టర్కు పూర్తి అధ్యయన నివేదికను సమర్పించనున్నారు.ప్రధానంగా సముద్రపు నాచు జాతులు కప్ప ఫైకస్ అల్వారెజీ, గ్రాసిలేరియా ఎడ్యులిస్ లను సాగు చేస్తున్నారు. కప్ప ఫైకస్ అల్వారెజీ ద్వారా కేరాజినన్ అనే పదార్థాన్ని పొందుతారు. ఇది ఆహార పదార్థాలు, ఔషధాలు, సౌందర్య సాధనాలలో స్థిరపదచే పదార్థంగా ఉపయోగిస్తారు. గ్రాసిలేరియా ఎడ్యులిస్ ద్వారా ఆగర్ అనే పదార్థాన్ని తయారుచేస్తారు. ఇది మైక్రో బయాలజీ లాభాలు, ఆహార పరిశ్రమ మరియు ఔషధాల తయారీలో విస్తృతంగాఉపయోగిస్తారు.అంతే కాకుండారెండు జాతులు కూడా పంటల సాగులలో రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పంటల వృద్ధిని పెంచే సహజ ఉత్పత్తులైన జీవ వృద్ధి ఉద్దీపకాలు (బయో స్టిములెంట్) గా కూడా ఉపయోగిస్తారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ సముద్రపు నాచు సాగు తీర ప్రాంత ప్రజలకు స్థిరమైన ఆదాయం కల్పిస్తుందన్నారు. దీంతోపాటు కార్బన్ శోషణ(కార్బన్ అబ్సెర్షన్) చేయడం ద్వారా సముద్ర జీవవైవిద్యం పెంపు, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది అన్నారు. అనువైన ప్రదేశాలను ఎంపిక చేసిన తర్వాత డిఆర్డిఏ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో సముద్ర తీర ప్రాంతాలలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, సాంప్రదాయ మత్స్యకారులు, యువకులలో ఔత్సాహికులను గుర్తించి వారికి సముద్రపు నాచు సాగులో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టుకు గ్రీన్ క్లైమేట్ఫండ్ మరియునాబార్డ్నిధులు సమకూర్చ నున్నాయన్నారు.ఈరెండు సంస్థలు పర్యావరణ అనుకూల గ్రామీణ జీవనోపాధి ప్రోత్సాహక కార్యక్రమాలకు మద్దతు ఇవ్వనున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు. సమృద్ధమైన సముద్ర జలాలు, అనుకూలమైన తరంగ ప్రవాహాలు, పుష్కలమైన పోషకాలు కలిగిన కోనసీమ తీర ప్రాంతం సముద్రపు నాచు సాగుకు అనుకూలమైనదని, పైలెట్ ప్రాజెక్టు విజయవంతం అయితేఇతరమండలాల్లోకి విస్తరించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. మెరైన్ రీసెర్చ్ సంస్థలు, ఫిషరీస్ విశ్వవిద్యాలయాలతో కలిసి శాస్త్రీయ మార్గదర్శకాలను పాటిస్తూ ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ బ్లూ ఎకానమీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సుస్థిరమైన గ్రామీణ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉండేవిధంగారూపుదిద్దుతామని కలెక్టర్ పేర్కొన్నారు. అమలాపురం కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో సీఎస్ఐఆర్ మండపం శాస్త్రవేత్త డాక్టర్ ఎల్ సతీష్, అమలాపురం ఆర్డీవో కే.మాధవి, జిల్లా ఫిషరీస్ అధికారి పీవీ శ్రీనివాసరావు, డిఆర్డిఏ పిడి నాగేశ్వరరావు, కాకినాడ మత్స్యశాఖ ట్రైనింగ్ కేంద్రం ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి,జిల్లాఅటవీశాఖ అధికారి ఎం.వి.ప్రసాద్రావు, నాబార్డ్ జిల్లా మేనేజర్ స్వామి నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, గ్రీన్ క్లైమేట్ ఫండ్ ప్రతినిధి శ్రీహర్ష, శాస్త్రవేత్తలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కిషోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ ప్రారంభం

# మే 2 నుండి 10వ తారీఖు వరకు శిక్షణా తరగతులు

**పెరవలి,మేజర్న్యూస్:**కానూరు, మల్లేశ్వరం,అన్నవరప్పాడు, నల్లకులవారి పాలెం, కొత్తపల్లి, కడింపాడు, కాకరపర్రు గ్రామాలలో మే 6వ తేదీ మంగళవారం ఆయాగ్రామాలలోనిఅంగన్వాడీల ఆధ్వర్యం లో కిశోర బాలికల వేసవి విజ్ఞానశిబిరం కార్యక్రమాలుజరిగాయి.కానూరు గ్రామం లో 43వ నెంబరు అంగన్వాడి కేంద్రంలో కిశోర వికాసం సమ్మర్ క్యాంపెయిన్ శిక్షణా తరగతులను కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ పి.తేజశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి తేజశ్రీ మాట్లాడుతూ కిశోర బాలికలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి కిషోరీ వికాసాన్ని ఏవిధంగా సాధించాలి, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా డెవలప్ చేయాలి అనే అంశాలపై మరియు బాలల హక్కులు, చట్టాలు కౌమారబాల బాలికల సమస్యలు,ఆరోగ్యవంతమైన నేను నా పోషణఅవసరాలు, పిల్లల సంరక్షణ, పిల్లల సంరక్షణలో బాల కార్మిక వ్యవస్థనిర్మూలన, బాల్యవివాహ నిర్మూలన చట్టాల గురించి అలాగే పోస్కో చట్టం గురించి కౌమారంలో వచ్చే మార్పులు మరియు సమస్యల గురించి 18 సంవత్సరములు నిండకుండా వివాహం చేస్తేసంభవించే అనర్థాలు గురించి అవగాహన కల్పించారు.





ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడి టీచర్లు ఫెసిలిటేటర్ గ్రూప్ డిస్కషన్స్ మరియు పిల్లలతో డ్రామాలు, రోల్ ప్లే లాంటివి చేయించడం ద్వారా పిల్లల్లో ఉన్న స్కిల్స్ కూడా డెవలప్ చేయడం వాళ్ళని ఎడ్యుకేట్ చేయడం అనే అంశాల మీద పిల్లలకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్ర మంలో సిహెచ్ఓ కే జయమని,హెల్త్సూపర్వైజర్ కే నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, గ్రామ మహిళా పోలీసు, అంగన్వాడీ కార్యకర్తలు, కిషోరి బాలికలు, పాల్గొన్నారు.

## పౌర రక్షణ సదుపాయాల బలోపేతం మరియు సమాజ శిక్షణపై అవగాహనా కార్యక్రమం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కలెక్టర్, కాకినాడ జిల్లా వారి ఆదేశాముల మేరకు జగ్గంపేట మండల కేంద్రమైన జగ్గంపేట గ్రామము నందు పౌర రక్షణ సదుపాయాల బలోపేతం మరియు సమాజ శిక్షణ, పౌర రక్షణ చట్టం 1968 ప్రకారం పాటించవలసిన అంశముల పై తీసుకోవలసిన జాగ్రత్త పై అవగహన కార్యక్రమము నిర్వహించడం జరిగింది. సదరు కార్యక్రమములో ప్రజలు యుద్ధ సమయములో ఏవిధమైన చర్యలు తీసుకువాలో, సైరాన్ సంకేతం ఇచ్చినప్పుడు ఏవిధముగా జాగ్రత్తలు తీసుకువాలో తెలుయజేసి నారు. కార్యక్రమములో మండల స్థాయి అధికారులు అయిన తహసీల్దార్, ఎంపీడివో, ఫైర్ ఆఫీసర్ మరియు జివిఎస్డబ్ల్యుఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యుద్ధ పరిస్థితులపై అవగాహన కొరకు మాక్ డ్రిల్

**- పిఠాపురం మున్సిపల్ కమిషనర్ ఎన్. కనకారావు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఇరు దేశాల యుద్ధ వాతావరణ పరిస్థితుల ప్రభావం రీత్యా ప్రజలకు అవగాహన కల్పించుటకు కేంద్ర ప్రభుత్వం వారి ఆదేశాలను అనుసరించి స్థానిక ఉప్పాడ బస్టాండ్ చిన్నమాంబ పార్కు వద్ద మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని పిఠాపురం మున్సిపల్ కమిషనర్ నామకనకారావు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను "సివిల్ డిఫెన్స్ ప్రిపరేషన్ (మాక్ డ్రిల్ )" నిర్వహించి పలు అంశాలను వివరించారు. సమాజ శిక్షణ మరియు పౌరులకు, విద్యార్థులకు మరియు స్వచ్ఛంద సేవల వారికీ అవగాహన కల్పించుట, పౌర రక్షణ సేవల క్రియాశీలత, రక్షణ చర్యలు మరియు మౌలిక సదుపాయముల ఏర్పాటు, ప్రణాళికలు మరియు రిహార్సల్, ప్రజా భాగస్వామ్యం మరియు కమ్యునికేషన్, పర్యవేక్షణ మరియు జవాబుదారీతనం వంటి అంశాలను తెలియజేశారు. ఈ మాక్ డ్రిల్ కార్యక్రమంలో పిఠాపురం మండల తహసిల్దార్, పురపాలక సంఘం, మెడికల్ & హెల్త్ డిపార్టుమెంటు, ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక డిపార్టుమెంట్, ఎస్ హెచ్ జి గ్రూప్, గ్రామా వార్డు సెక్రటరి వార్లు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఇంజనీరింగ్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమ్మె



**పెద్దాపురం రూరల్, మేజర్న్యూస్ :** పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు బుధవారం ఇచ్చిన ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు పిలుపులో భాగంగా సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ నాయకులు మాట్లాడుతూ పెద్దాపురం పురపాలక సంఘం ఇంజనీరింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరూ సమ్మెకు వెళ్లుచున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర నాగేశ్వరరావు, సుంకర సత్తిరాజు, నామ సూర్యప్రకాశరావు, పూల ప్రశాంత్, మహపాతిన పాపారావు, వాకాడ భాస్కరరావు, కోనాల వెంకటరమణ, ఒంటిమి సోనియా, అయ్యప్ప స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# చింతూరులో ఆర్ అండ్ ఆర్ గ్రామసభ విజయవంతం





**– గ్రామ సభలో పాల్గొన్న ఐటీడీఏ అధికారి అపూర్వ భరత్**

**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలో 30వ ( ఆఖరి) ఆర్ & ఆర్ గ్రామ సభను చింతూరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ బుధవారం నిర్వహించడం జరిగినది. ఈ గ్రామ సభలో మొదట అర్హుల మరియు అనర్హుల జాబితాను అధికారుల, ప్రజా ప్రతినిధుల, మీడియా మిత్రుల, మరియు నిర్వాసితుల సమక్షంలో చదివి వినిపించడం జరిగినది. చింతూరు గ్రామంలో మొత్తం 1808 పిడిఎఫ్ లు గాను 1641 మందిని అర్హులు గాను 167 మందిని అనర్హులుగా గుర్తించడం జరిగినది. చింతూరు నందు నివసిస్తూ రెండు జాబితాలో పేర్లు లేని వాళ్ళ నుండి ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు వారు దరఖాస్తులు తీసుకోవటం జరిగినది.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు జాబితాలో పేర్లు లేని వాళ్లను కూడా మాన్యువల్ గా జాబితాలో చేర్చి వారికి కూడా అర్ & ఆర్ ప్యాకేజీ అందించాలని ఇదీ వరకే చెప్పి ఉన్నారు. అని దీని నిమిత్తం రెండు జాబితాలో పేర్లు లేనివారిని కచ్చితంగా అర్ & ఆర్ ప్యాకేజీ జాబితాలో చేర్చుటం జరుగుతుంది అని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి పేర్కొన్నారు.

ఈ గ్రామ సభతో పోలవరం ప్రాజెక్టు ముంపుకు గురి అవుతున్న ఫేజ్ 1బి లో ఉన్న 32 గ్రామాలకు విజయవంతంగా ఆర్ & ఆర్ గ్రామ సభలు నిర్వహించడం జరిగినదన్నారు. మొత్తం ఈ 32 గ్రామాలకు సంబంధించి మొత్తం 13807 పిడిఎఫ్ లు గాను 12468 మందిని అర్హులుగా మరియు 1339 మందిని అనర్హులుగా గుర్తించడం జరిగినది అని ప్రాజెక్టు అధికారి పేర్కొన్నారు. తదుపరి గ్రామసభలో తీసుకున్న అభ్యంతరాలను మరో పది రోజులలో పరిష్కరించడం జరుగుతుంది అని తెలియజేశారు. అదే విధంగా హౌస్ స్ట్రక్చర్ వాల్యుయేషన్ మరియు అర్ & ఆర్ కాలని కోసం భూమి, భూమికి భూమి వంటి అంశాల మీద తదుపరి దృష్టి పెట్టడం జరుగుతుంది అని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. ఆర్ & అర్ మరియు భూమికి భూమి గురించి భూమిని గుర్తించే ప్రక్రియలో ఇరిగేషన్, అగ్రికల్చర్, హార్టికల్చర్ మరియు ఆర్డబ్ల్యూఎస్ శాఖలతో టీంలను రేపు చేసుకొని భూమి క్వాలిటీ చెక్ చేయటం జరుగుతుంది అని అన్నారు.తదుపరి ప్రాజెక్టు అధికారి త్వరలోనే ముంపుకు గురి అవుతూ 41.15 కాంటూరులో చేర్చాని గ్రామాలను కూడా ఇరిగేషన్ టెక్నికల్ టీంతో సర్వే చేయించి వాటిని కూడా 41.15 కాంటూరు లో చేర్చి ఆ గ్రామాల నిర్వాసితులకు కూడా ఆర్ & అర్ ప్యాకేజీ అందించే విధంగా కృషి చేయటం జరుగుతుందన్నారు. ఫేజ్ 1ఏ లో ఉన్న గ్రామాల యొక్క ఆర్ & ఆర్ కాలనీల మౌలిక సదుపాయాల పనులు కూడా త్వరలో ప్రారంభించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము అని పేర్కొన్నారు. ఏ ఒక్క అర్హుడైన నిర్వాసితుడికి అన్యాయం జరగకుండా నా వంతు కృషి చేస్తాను అని ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ తెలిపారు. ఈ సందర్భంగా మధ్యవర్తుల మాటలు నమ్మి మోసోవద్దని నిర్వాసితులకు మరొకసారి ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ సూచించారు. ఇన్ని రోజులు గ్రామసభలకు సహకరించిన ప్రజా ప్రతినిధులకు, మీడియా మిత్రులకు మరియు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ చింతూరు గ్రామసభలో చింతూరు సర్పంచ్ కారం కన్నరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బాలకృష్ణ రెడ్డి, నజరయ్య, ఆంజనేయులు, తహసీల్దార్‌లు చిరంజీవి, శ్రీనివాస్,వీఆర్వో రామచంద్రం, చింతూరు ఎంపీడీవో మరియు రెవెన్యూ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం శాఖా గ్రంధాలయంలో వేసవి శిక్షణా తరగతులలో భాగంగా గ్రంధాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఉపాధ్యాయులు గుణ్ణం లక్ష్మీనారాయణ విద్యార్ధులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, గణితం, సైన్స్, తెలుగులో నామవాచకాలపై వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది బుల్లియ్య, విద్యార్ధులు పాల్గొన్నారు.

# ఉగ్ర శిబిరాలు ధ్వంసం భారత్ సైనిక సత్తాకు నిదర్శనం

**– ఎమ్మెల్యే సత్యానందరావు**



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** పాకిస్థాన్ లోని 4, ఆక్రమిత కాశ్మీర్లో ఐదు ఉగ్ర స్థావరాలను మిసైల్స్ ద్వారా ధ్వంసం చేయటం భారత సైనిక సత్తాకు నిదర్శనమని కొత్తపేటఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పహల్‌గాంలో పర్యాటకులపై విచక్షణారహితంగా దాడులు చేసి 26 మంది మృతికి కారుకులైన ఉగ్రవాదులకు 15 రోజులలో భారత సైన్యం పాకిస్థాన్‌కు సరైన గుణపాఠం చెప్పిందని అన్నారు. ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామంలో బుధవారం జాతీయ జెండాలతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భారత్ సైనిక్ చర్యక మద్దతుగా జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహిల్గాం మారణకాండకు పాకిస్థాన్లోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు జరిపి విజయవంతంగా వాటిని ధ్వంసం చేసిన తీరు భారతీయులకు గౌరవాన్ని తెచ్చిపెట్టిందని అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రక్షణ శాఖ మంత్రి రాజనాద్ సింగ్ ఆధ్వర్యంలో త్రివిధ దళాలు సంయుక్తంగా దాడులకు పథక రచన చేసి 26 నిమిషాల్లో మిస్సైల్స్‌తో తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడం భారత సైనిక సత్తాకు నిదర్శనం అని అన్నారు.

ఈ ఆపత్కాల సమయంలో భారతీయులు అందరు ప్రభుత్వానికి అండగా నిలబడి సైనికులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని భారతీయుల ఐక్యత దేశ సమగ్రత చాటి చెప్పాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జుజ్జవరపు శ్యామల హరిబాబు, రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యనిర్వాహక కార్యదర్శి ముళ్ళపూడి భాస్కరరావు, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కనులపండువగా ఎదుర్కోలు ఉత్సవం



అన్నవరం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో కళ్యాణం ఉత్సవంలో భాగంగా మొదటి రోజు బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రధాన ఆలయం వద్ద అనివేటి మండపంలో వివిధ రకాల సుగంధ భరితమైన పుష్పములతో అలంకరించిన మండపంలో ఉన్న సింహాసనం పై శ్రీ స్వామి అమ్మవాళ్లను పెండ్లి కుమారుడిగా, పెళ్లి కుమార్తెగా చేశారు. గణపతి పూజ, ఉలుకాల గౌరీ పూజ, పేరంటాలకు వాయినాలు ఇచ్చిట రాత్రి 7 గంటలకు శ్రీ స్వామివారు అమ్మవాళ్లను రాజా వెంకటరామరాయ కళామందిరం నందు ఎదుర్కోలు ఉత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవి రోహిత్, ఏఈఓ కొండలరావు, పిఆర్ఓ దామోర్ల కృష్ణారావు, దేవస్థానం అధికారులు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జే.కె.సి.టి. ట్రస్ట్ ద్వారా త్రాగునీటి బోర్ హ్యాండిల్ అందజేత




**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండలంలోని చట్టి గ్రామ పంచాయితీ శివాలయం గుంపులో బుధవారం త్రాగునీటి బోర్‌నకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.18,000 విలువగల బోర్ హేండిల్, 7 పైపులు, 7 రాడ్లు, కాప్లింగిల్‌లు గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు తీవ్రంగా ఉందని అందుకు గాను గ్రామాల్లోని మరమ్మత్తులకు గురైన మంచినీటి బోర్‌లను ప్రెస్సింగ్ చేయించాలని దానికి తాను స్వయంగా మరమ్మత్తులు చేయించటం జరుగుతుందని తెలిపారు. త్రాగు నీటి సమస్యలు ఎక్కడైనా తీవ్రంగా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని సాధ్యమైనంత వరకు పరిష్కారం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జే.కె.సి.టి ట్రస్ట్ సభ్యులు చట్టి గ్రామస్తులు ముత్తయ్య, నాయకులు ముత్యాల రామారావు, పి.సాల్మానరాజు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు అండగా వైఎస్ఆర్సిపి రిలే నిరహార దీక్షలో పాల్గొన్న నేతలు



**అమలాపురం, మేజర్‌న్యూస్ :**రైతు పండించిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ జిల్లా వైస్సార్ సీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష బుధవారం చేపట్టారు.కలెక్టర్ కార్యాలయం ముక్తేశ్వరం రోడ్డులో ఓటెద్దు వెంకన్న నాయుడు కాంప్లెక్స్ వద్ద డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి గఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నేతలు తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడిపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, పొన్నాడ సతీష్, గొల్లపల్లి సూర్యారావు, గన్నవరపు శ్రీనివాస్, పిల్లి సూర్య ప్రకాష్, పినిపే శ్రీకాంత్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, అమలాపురం మాజీ ఎంపీ పండు రవీంద్ర బాబు, మున్సిపాలిటీ చైర్మన్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు,పెద్ద సంఖ్యలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ‘ఐటీడీఏ’లో విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి





రంపచోడవరం, మేజర్‌న్యూస్ : భారతదేశంలో స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై పోరాటం చేసి అసువులు బాసిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును దేశ ప్రజలందరూ ఎప్పటికీ మర్చిపోలేరని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి పురస్కరించుకొని స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ భారతదేశం స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై ఈ ప్రాంత గిరిజనులతో కలిసి పోరాటం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. దేశం కోసం బ్రిటిష్ వారిపై పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు స్మారకంగా పాడేరు కొత్త జిల్లాకు అల్లూరి సీతారామరాజు జిల్లా అని నామకరణం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. దేశం కోసం పోరాటం చేసిన యోధుడు అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారి చేతుల్లో తుపాకి గుండ్లకు అల్లూరి సీతారామరాజు బలి కావడం జరిగిందని, అదేవిధంగా దేశంలోని ప్రతి భారతీయ పౌరుడు అల్లూరి సీతారామరాజును ఎప్పటికీ గుర్తుపెట్టుకోవాలన్నారు. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.ఎన్.వి.రమణ, గిరిజన సంక్షేమ డీఈ చైతన్య, ఎస్టిఓ పాపారావు, సీనియర్ అకౌంటెంట్ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్‌లు బి.కిషోర్, రాజారెడ్డి, ఐటీడీఏ మేనేజర్ బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, చక్రధర్, లక్ష్మి, డి.ప్రభాకర్ రావు, పల్లాల భీమిరెడ్డి, శివ, చదల సోమిరెడ్డి, శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, ఎం.పి.హెచ్.ఓ. కుసుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ శృంగారవల్లభ స్వామి సన్నిధిలో జిల్లా కలెక్టర్ షాన్మోహన్ ప్రత్యేక పూజలు



పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామివారిని బుధవారంకాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్ శ్రీశ్రీ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.వీరికి తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావులు స్వాగతం పలికారు. వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, దేవస్థాన వేదపండితులు, పలువురు అధికారులు ఉన్నారు.

## పంచతంత్ర కథలతో మానసిక వ్యక్తిత్వ వికాసం




కాకినాడ, మేజర్ న్యూస్ : పంచతంత్ర కథలు చదవడం వలన విద్యార్థులకు మానసిక వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని కవయత్రి గునుపూడి సావిత్రి ప్రసాద్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని వివేకానంద్ పార్కులో గల గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో బుధవారం నాడు నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులలో పాఠశాల విద్యార్థులకు దేశభక్తి, మతసామరస్యం గురించి ఆమె వివరించారు. ప్రస్తుత పరిస్థితులలో మన దేశానికి అందరూ మద్దతుగా నిలవాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు మర్యాద రామన్న కథలు, గలివర్ సాహస యాత్రలు తదితర పుస్తకములను చదవడం జరిగింది. డ్రాయింగ్ ఉపాధ్యాయులు టీ.జయరాం విద్యార్థులకు చిత్రలేఖనములో శిక్షణ ఇవ్వడం జరిగింది. శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకుని విజ్ఞానవంతులు కావాలని కోరారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వరుపుల..



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) చొరవతో రమణయ్యపేట, మార్కండేయపురం గ్రామాలలో త్రాగునీటి సౌకర్యానికి సుమారు మూడు లక్షల రూపాయల వ్యయంతో రెండు నూతన బోర్వెల్ లకు ఎమ్మెల్యే సత్య ప్రభ చేతుల మీదుగా బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం ఏలేశ్వరం వెలుగు కార్యాలయం నందు మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమంను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయం నందు రైతులకు సుమారు 26 లక్షల రూపాయల వ్యయంతో వ్యవసాయ పనిముట్లను ఆయా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని అభినందించారు. మహిళా సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని దానిలో భాగంగానే మహిళలకు కుట్టు శిక్షణా కార్యక్రమంను 90 రోజులపాటు నిర్వహించి అనంతరం 25000 విలువచేసే కుట్టు మిషన్లను లబ్ధిదారులకు అందజేయనున్నామని అన్నారు. రైతులను అన్ని విధాల ఆదుకునే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని దానిలో భాగంగానే సబ్సిడీలు పై సబ్సిడీలపై రైతులకు అవసరమగు వ్యవసాయ పనిముట్లను అందజేశామని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం రైతులను పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. నేను రెండు నెలలు అనారోగ్యం రీత్యా ప్రజలలో లేకపోయినా పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేస్తూ ప్రజా మన్ననలు పొందారని వారందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీడీవో సూర్యనారాయణ, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి) సూతి భూరయ్య, పసల సూరిబాబు, చిక్కాల రాజ్యలక్ష్మి లక్ష్మణరావు, బుద్ధ కొప్పుల బాబ్జి, అలకరాజు, బుద్ధ సూర్యప్రకాష్, బ్యాంకు రాజు, శ్రీధర్, మైరాల కనకారావు, జిగటాపు సూరిబాబు, పలివెల వేంకటేశ్వరరావు, పలివెల. శ్రీను ,గంగిరెడ్ల మణికంఠ,కర్ణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న డిఎస్పి శ్రీహరిరాజు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు ప్రసిద్ది చెందిన శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని బుధవారం పెద్దాపురం డిఎస్పి డి.శ్రీహరిరాజు కుటుంబ సమేతంగా శ్రీ శ్రీశ్రీ మరిడమ్మ అమ్మ వాఓరిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ పర్యవేక్షణలో వేదపండితులు అమ్మవారి దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనాలు అందజేసి, అనంతరం ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాద ˇశర్మ,ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్,సిబ్బంది వెంకటరమణ, వరహాలు, లోవ, శివ తదితరులు ఉన్నారు.

## ట్రస్ట్ బోర్డులకు నోటిఫికేషన్ విడుదల

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం, పెద్దాపురం పట్టణంలోని శ్రీ విశ్వేశ్వర చంద్రశేఖర స్వామి వారి దేవస్థానం, శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం, శ్రీ ఆళక్కి వెంకట్రామయ్య సత్రం, కట్టమూరులోని కేశవ పట్టాభిరామస్వామి వారి దేవస్థానంలకు ధర్మకర్తల మండలి కొరకు నోటిఫికేషన్ దేవదాయ ధర్మదాయ శాఖ కమీషనర్ ఉత్తర్వులు ఇచ్చినట్లు కార్యనిర్వాహణాధికారులు కాట్నం జగన్మోహన శ్రీనివాస్, పొన్నావర్జుల సాయి శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ కావున ఆశక్తి గల అభ్యర్థులు జిల్లా దేవదాయ శాఖ అధికారి, కాకినాడ వార్కి ధరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఇఓలు వివరించారు.

## మరోసారి ఐటీడీఏ పాలకవర్గ సమావేశం వాయిదా



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఇప్పటికే అనేకసార్లు వాయిదా పడుతూ వచ్చిన రంపచోడవరం ఐటీడీఏ పాలకవర్గ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈనెల 13వ తేదీన జరగాల్సిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని అధికారులు మరోసారి వాయిదా వేశారు. 2019 డిసెంబర్ మాసంలో జరిగిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశం ఆ తర్వాత ఇప్పటివరకు జరగలేదు. గత ఐదు సంవత్సరాలు తర్వాత మరలా ఈనెల 13వ తేదీన ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

అయితే ఈ సమావేశాన్ని మరలా వాయిదా వేసినట్టు ఐటిడిఏ అధికారులు బుధవారం ప్రకటించారు. ఇప్పటికే ఐదు, ఆరుసార్లు ఐటిడిఏ పాలకవర్గ సమావేశం నిర్వహించడానికి తేదీలు నిర్ణయించి, కారణాంతరాల వల్ల వాయిదా వేసుకుంటూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తాజాగా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ చైర్మన్ నుండి వచ్చిన సూచనల మేరకు మరోసారి ఐటిడిఏ పాలకవర్గ సమావేశం వాయిదా పడింది. వచ్చే నెల జూన్ మూడో తేదీన ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారని సమాచారం. అయితే ఈనెల 13వ తేదీన ఐటీడీఏ పాలకవర్గ సమావేశం ఎందుకు వాయిదా వేశారో కారణం ఐటీడీఏ అధికారులు తెలియ జేయలేదు.

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల సమస్యలు, అభివృ ద్ధికి ఖర్చు చేసిన నిధులు వ్యయం పై చర్చించవలసిన ఐటిడిఏ పాలకవర్గ సమావేశం తరచూ వాయిదాలు వేయడంపై గిరిజన ప్రజాప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు.

# పహల్గాంలో ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్య "ఆపరేషన్ సిందూర్"

**- పర్యాటకుల మరణానికి కారణమైన వారిపై ప్రతీకారం తీర్చుకోవడం నిజమైన నివాళిగా భావిస్తున్నాం**

**- ఉగ్రవాదం అంతం కావడమే అంతిమ లక్ష్యం కావాలి**

**- కందుల దుర్గేష్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు**



**ఉమ్మడి గోదావరి జిల్లాలో సూర్య బ్యూరో :** అందమైన ప్రదేశాలను చూసి ఆస్వాదించేందుకు, ఆహ్లాదమైన వాతావరణంలో గడిపేందుకు వెళ్లిన అమాయకులైన పర్యాటకులను అన్యాయంగా పొట్టనబెట్టుకున్న ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్యే "ఆపరేషన్ సిందూర్" అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.. పహల్గామ్ దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. భారత సాయుధ బలగాలు ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడి చేసి గట్టి సమాధానమిచ్చాయని, తీవ్రవాదంపై భారత ఉక్కు సంకల్పానికి ఇది ఒక నిదర్శనం అని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి వందనం అని పేర్కొన్నారు. కశ్మీర్ లోని అనంత్ నాగ్ జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయలో ఉగ్రమూకల విచక్షణ రహిత కాల్పులతో పహల్గాంలో అన్యాయంగా ఎంతో మంది భారతీయ స్త్రీల నుదటన సింధూరం లేకుండా చేసిన బాధిత పర్యాటకుల ఆత్మలకు ఈ దాడితో శాంతి చేకూరుతుందని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ దాడి పర్యాటకులపై కాదు, భారత్ పై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు.. అమాయకులైన పర్యాటకులను బలిగొన్న ఘటన హృదయ విదారకమైనదని, దేశ సమగ్రతకు, ఐక్యతకు చిచ్చుపెట్టాలని చూస్తే సహించబోమని తెలిపారు. చేసిన పాపానికి పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.. యావత్ భారతదేశం ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండించాల్సిన సమయం ఇదని... భారత సైన్యానికి అండగా నిలవాల్సిన తరుణమని పిలుపునిచ్చారు... భారతదేశ ఐక్యతను ఉగ్రవాదం విచ్ఛిన్నంచేయలేదని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు.. అందరూ ఏకతాటిపై నిలిచి ఉగ్రవాదాన్ని తిప్పికొట్టాలని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుందాం.. ఉగ్రవాదుల దాడుల నుంచి దేశ పౌరులను రక్షించుకుందామని పిలుపునిచ్చారు. భారత్ మాతా కీ జై... జై జవాన్ అని మంత్రి దుర్గేష్ నినదించారు.

# గొప్ప పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్వాతంత్ర పోరాటంలో మన్యం ప్రాంతంలోని గిరిజనుల సమీకరించుకొని బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన గొప్ప పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు అని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. బుధవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా..పాడా పీడీ చైత్ర వర్షిణి ఇతర శాఖల అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ..తెలుగు నేల మీద స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న అనేక మంది ఉద్యమకారులలో అల్లూరి సీతారామరాజు ఒకరన్నారు. భారత స్వాతంత్ర సంగ్రామానికి మన్యంలో ఎందరో పోరాట వీరులను తీర్చిదిద్ది బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన విప్లవ వీరుడు సీతారామరాజు అని ఆయన కొనియాడారు. మన్యం ప్రజల హక్కుల కోసం, దేశ స్వాతంత్ర కోసం పోరాడి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు జీవితం నేటి



యువతకు స్ఫూర్తిదాయకమని జేసీ తెలిపారు.కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, సెట్రాజ్ సీఈవో మల్లికార్జునరావు, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్ రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వాసవి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి పురస్కరించుకొని అమ్మవారికి పట్టువస్త్రాలను కాకినాడ జిల్లా అధ్యక్షులు పీవి కుమార్ మరియు కార్యవర్గం సభ్యులు సమర్పించారు. కొత్తగా ఏర్పడిన మహాసభ కాకినాడ జిల్లాలో మొదటగా కార్యవర్గ సభ్యులు అందరితో కలసి పిఠాపురం వాసవి అమ్మవారికి జయంతి సందర్భగా పట్టువస్త్రాలు సమర్పించచడం మహాదానందంగా వుందన్నారు. ఈ సందర్భంగా గా కార్యక్రమాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో చేయించిన జిల్లా ఉపాధ్యక్షులు వెలగా వెంకట నగేష్, జోన్ చైర్మన్ నాగేంద్ర కుమార్, జిల్లా ఇంచార్జి బోడ సతీష్ కు మరియు పిఠాపురం మండల అధ్యక్షులు రేపాక రమేష్, సెక్రటరీ కె.శ్రీరామ్, కోశాధికారి కంచర్ల నగేష్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు విజేత జగ్గంపేట

**- ఫైనల్ మ్యాచ్లో వేలంగి జట్టుపై జగ్గంపేట గెలుపు**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో ఎన్నారై కల్లేపల్లి రాజేష్ ఆధ్వర్యంలో 30 రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు 32 జట్లు తలపడగా బుధవారంతో ముగిసాయి. ఫైనల్ మ్యాచ్లో కాకినాడ రూరల్ వేలంగి,జగ్గంపేట జట్లు తలపడగా జగ్గంపేట జట్టు విజయం సాధించింది. ఇరుజట్ల మధ్య ఉత్కంఠ భరతంగా జరిగిన ఫైనల్ పోటీల్లో మొదటి బ్యాటింగ్ చేసిన వేలంగి జట్టు నిర్ణీత 10వలలో 91 పరుగులు చేయగా జగ్గంపేట జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ కల్లేపల్లి రాజేష్ కుటుంబ సభ్యులు శంకర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. గెలుపొందిన జట్టుకు మెమొంటోతో పాటు రూ 55 వేల 555 రూపాయల నగదు, రన్నర్ చెక్కు, మెమొంటోతో పాటు రూ 33 వేల 333 రూపాయలు అందజేశారు. మాన్ అఫ్ ది మ్యాచ్ టోర్నీగా జగ్గంపేట కెప్టెన్ శ్రీమన్నారాయణకు రూ 6 వేల 666 రూపాయల నగదు అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడాకారులను అభినంది ంచడం గొప్ప విషయం అన్నారు. క్రీడాకారులు గెలుపోవటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తితో వ్యవహరించడం అభినందనీయం అన్నారు నెల రోజులపాటు క్రీడలను నిర్వహించిన కల్లేపల్లి రాజేష్ యూత్ సభ్యులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

# ప్రతి గ్రామంలోనూ తడి-పొడి చెత్త సేకరణ చేపట్టాలి

**- కొత్తపేట ఆర్డిఓ శ్రీకర్**





**రావులపాలెం, మేజర్‌న్యూస్ :** ప్రతి గ్రామ పంచాయతీలోనూ తడి పొడి చెత్త సేకరణ చేపట్టాలని అలాగే చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీకర్ ఆదేశించారు. బుధవారం రావులపాలెం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. తడి పొడి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతుంది, సేకరించిన చెత్తను ఈ సంపద కేంద్రాల వద్ద ఏ విధంగా వర్మి కంపోస్టు తయారు చేస్తున్నారు అనేదానిపై గ్రీన్ అంబాసిడర్ లను ప్రశ్నించారు. వర్మీ కంపోస్ట్ మరింత ఉత్పత్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇలా తయారైన వర్మి కంపోస్టు మార్కెటింగ్ పై ఆరా తీయగా కొనుగోలు దారులు తక్కువగా ఉంటున్నారని ఎంపీడీవో మహేశ్వర రావు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రావులపాలెంలో ఎన్ని వాహనాల ద్వారా ఎంతమంది పారిశుధ్య కార్మికులు తడి పొడి చెత్త సేకరణ చేపడుతున్నారనే వివరాలను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆర్డివొకు వివరించారు. అలాగే మండలంలో ప్రస్తుతం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వర్మి కంపోస్ట్ ఉత్పత్తి వివరాలు అందజేయాలని డిప్యూటీ ఎంపీడీవో కృష్ణ కు ఆర్డోవో సూచించారు.

## కిశోర బాలికలకు బాల్యవివాహాలపై అవగాహన



పెరవలి, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కాపవరం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం నెంబర్ 15లో మే 6 వ తేదీ మంగళవారం కిశోర బాలికల వేసవి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్వైజర్ లక్ష్మి మాట్లా డుతూ కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు బాల్యవివాహాల వల్ల జరిగే అనర్ధాలు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు తోపాటు గ్రామ మహిళా పోలీస్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ ఆయాలు, కిశోర బాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయం నందు బుధవారం ఎస్పీ జి. బిందు మాధవ్ మరియు జిల్లా పోలీస్ అధికారులు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా, జిల్లా పోలీస్ కార్యాలయం నందు వారి చిత్రపటాన్ని పుష్పాలంకరణ చేసి, నివాళులర్పించి,భారత స్వాతంత్ర పోరాటంలో ఆయన చేసిన సాయుధ పోరాట సేవల స్ఫూర్తిని కొనియాడారు.ఈకార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ పరిపాలన ఎఆర్ భాస్కరరావు, అదనపు ఎస్పీ ఎఆర్ శ్రీనివాసరావు, డీఎస్పీ ఎఆర్ శ్రీహరి రావు, జిల్లా కార్యాలయ వివిధ విభాగాల ఇన్స్పెక్టర్లు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం మన లక్ష్యం కావాలి

**– ఉగ్రవాద స్థావరాలు, శిబిరాలపై దాడి అనివార్య చర్య**

**: మంత్రి సుభాష్**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ఆపరేషన్ సిందూర్ కోసం భారత బలగాలు తీసుకున్న నిర్ణయం పట్ల దేశం యావత్తు అండగా నిలుస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈ విషయమై ప్రస్తావిస్తూ ఉగ్రవాద స్థావరాలు, శిబిరాలపై దాడి అనివార్య చర్య. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం, ఉగ్రవాదుల దాడుల నుంచి తన పౌరులను రక్షించుకోడం అన్నది దేశానికి అత్యంత ముఖ్యమైన కర్తవ్యం అని మంత్రి పేర్కొన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉన్న బైసరన్ వ్యాలీకి పర్యాటకులుగా వెళ్లిన అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడి మానవత్వంపై జరిగిన దాడి. అలాంటి ఉగ్ర చర్యలపై భారత రక్షణ దళాలు గట్టిగా స్పందించాయి. ఆపరేషన్ సిందూర్ అనివార్యమైనచర్య. భారత రక్షణ బలగాలకు యావత్‌దేశం అండగా నిలుస్తుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంపై దేశ ప్రజలకు అపారమైన నమ్మకం ఉందన్నారు. దేశ పౌరుల భద్రత ధ్యేయంగా రక్షణ బలగాలు తీసుకుంటున్న చర్యలకు దేశమంతా మద్దతుగా నిలుస్తోంది– జైహింద్ అని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

# వరి కోతలపై రైతులు ఆందోళన

**– రైతులకు శాపంగా మారిన ఎన్ఆర్ఈజీఎస్ పథకం**



**అల్లవరం, మేజర్ న్యూస్ :** వరి కోతలపై రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం శాపంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దాల్వా పంటకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంతో పంటకు దిగుబడి బాగా వచ్చిందని రైతులు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం వల్లన కూలీలు రాకపోవడంతో యంత్రాలు సాయంతో వరి కోతలు సాగుతుంది. అధిక వర్షం కురవడంతో మిషన్‌లు చేళ్ళల్లో దిగలేని పరిస్థితుల్లో కూలీలు ద్వారానే కోతలు కోయించుకుని పరిస్థితి ఏర్పడింది. అల్లవరం పలు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం పనులు నిలుపుదల చేయాలని రైతులు అధికారులకి, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నప్పటికి ఎక్కడ నిలుపుదల చేయకపోవడంతో మాకు ఆత్మ హత్యలే శరణ్యం అని రైతులు వాపోతున్నారు. చెల్లల్లో పూర్తి స్థాయిలో నీరు ఉండటంతో అటు యంత్రాలు రాక, ఇటు కూలీలు రాక మా పరిస్థితి ఏమిటి అని ప్రజా ప్రతినిధులను అధికారులను రైతులు నిలదీస్తున్నారు. పథకం పనులు ఆపకపోతే అప్పులు తీర్చలేక మా పరిస్థితి అతోగతిలా ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి అల్లవరం మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు 10 రోజులు నిలుపుదల చేసి రైతులను ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

## భారత్ - పాకిస్థాన్ యుద్ధ పరిస్థితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– ఆర్డీఓ కె.శ్రీరమణి**





**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** బుధవారం సాయంత్రం పెద్దాపురం పట్టణంలోని స్థానిక మున్సిపల్ సెంటర్‌లో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ, కమీషనర్ కె.వి.పద్మావతిలఆధ్వర్యంలో ప్రజలకు యుద్ధ పరిస్థితులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురంఆర్డీఓ కె.శ్రీరమణి మాట్లాడుతూ ఇండియా–పాకిస్థాన్ యుద్ధ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున దాడులు జరిగే అవకాశంలో భాగంగా యుద్ధ పరిస్థితులపై అధికార యంత్రాంగం ప్రజలకు హెచ్చరికలు జారీచేస్తుందని,కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దానిలో భాగంగానే ప్రజలు యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు ఎలా చేరుకోవాలో యుద్ధ సమయంలో ఎలా ఉండాలో మాక్‌డ్రిల్ నిర్వహించిఅవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా మానవహారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు.

# భావి తరాలు బావుండాలి

**– బెంగళూరు పాస్టర్ దాస్**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** భావి తరాలు బాగుండాలంటే నేటి యువత, చిన్నారులు సమాజం పట్ల బాధ్యత కలిగి అవగాహన పెంచుకోవాలని బెంగళూరు ఎంఎంసిఐ పాస్టర్ దాస్ అన్నారు. అల్లూరి సీతారామరాజు ఎటపాక మండలం మేడువాయి యేసుక్రీస్తు సీయోను మినిస్ట్రీస్ పాస్టర్ నవీన్ లాజరస్, హెప్సీబా ఆధ్వర్యంలో బుధవారం ఒక్కరోజు సండే స్కూల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో బెంగళూరు మెస్సయ్యా మినిస్ట్రీస్ చర్చ ఇండియా(ఎంఎంసిఐ) పాస్టర్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్నట్టు ఇప్పుడు బాలలు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడిపించాలని అందుకు తగిన విధంగా అందరూ బాధ్యత వహించాలని అన్నారు. సమాజంలో యువత పాత్ర కీలకమని ప్రస్తుతం దేశంలో భయంకర పరిస్థితులు చూస్తున్నామని అందుకు ప్రధాన కారణం దురలవాట్లేనని గుర్తుచేశారు. ఇందులో భాగంగా పిల్లలకు కథలు నేర్పించే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాలనుంచి క్రైస్తవులు హాజరయ్యారు. జాన్, శ్రీజ, మేరి, సరిత, సంగీత, ఓనేసిము, రవికాంత్, తిమోతి, గిద్యోను,పెదబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్ర గ్రంథాలయం కాకినాడలో బుధవారం వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులచే కమ్యూనికేషన్స్ స్కిల్స్ మరియు విద్యార్థులచే మైండ్ గేమ్స్‌పై ఎం.సత్యబాల డిఆర్‌డిఎ సిబ్బంది వారు శిక్షణ ఇవ్వ డం జరిగినది. తదుపరి విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యనారా యణచే స్టూడెంట్ గుడ్ హ్యాండ్ రైటింగ్ కార్యక్రమం ద్వారా విద్యార్థులచే ప్రాక్టీస్ చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు 63 మంది పాల్గొనడం జరిగినది.

## వాసవి అమ్మవారి పుట్టిన రోజు వేడుకలు



**అమలాపురం, మేజర్ న్యూస్ :** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ వాసవి అమ్మవారి జన్మ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం అమలాపురం మెయిన్ రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని వెండి పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు, అభిషేకం వంటి కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం నాలుగు గంటల నుండి లక్ష మల్లెల పూజ, సామూహిక కుంకుమ పూజలు వంటి కార్యక్రమాలు జరిగాయి. రాత్రి 7 గంటల నుండి పట్టణంలో గల ఆర్యవైశ్య సోదర సోదరీమణులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల వేంకట్రావు (బాబి)పాల్గొని అమ్మవారికి పట్టు చీర, సారెను సమర్పించారు. వారితో పాటు జిల్లా సంఘ కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు పోశెట్టి సూరిబాబు జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగ అధ్యక్షురాలు యెండూరి సీతామాలక్ష్మి లు పాల్గొన్నారు. ఉదయం నుంచి జరిగిన ఆయా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి వేంకటాచలప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, కోచైర్మన్‌లు పచ్చిగోళ్ళ సోమరాజు, నూలు శ్రీనివాసు, వరదా సూరిబాబు, సింగంశెట్టి కుమార్, నందిపాటి శ్రీనివాసు, మోటమర్రి కుమార్ తదితరులు వారి వారి సేవలను అందించారు.

# గ్రామాల్లో త్రాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

**– వద్దిపర్రులో ఆర్ఓ వాటర్ ప్లాంటును ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని గ్రామాలలో సురక్షిత త్రాగునీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆయన బుధవారం రాజమహేంద్రవరానికి చెందిన ఫణీంద్ర స్కానింగ్ సెంటర్ అధినేత సౌజన్యంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జొజ్జవరపు శ్యామల శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనులు పూర్తిచేసి ఎక్కడ త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఇటీవల కోటి రూపాయల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

బొబ్బర్లంక రహదారికి విస్తరణ చేసేందుకు రూ.36 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. ఆత్రేయపురం లాకులు పునర్నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉచ్చిలి పేరవరం వసంతవాడ ఎత్తిపోతల పథకాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యనిర్వాహక కార్యదర్శి ముల్లపూడి భాస్కరరావు, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.